

అంధకారంలో వంగర మండలం

ప్రజాశక్తి - వంగర

మండల కేంద్రంలో విద్యుత్తు సబ్ స్టేషన్ వద్ద ఉన్న వివిధ గ్రామాలకు వెళ్లే ట్రాన్స్‌ఫార్మర్లు రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షంతో పాటు పిడుగులు పడటంతో కాలిపోయాయి. దీంతో మండలంలోని దాదాపు అన్ని గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ప్రజలంతా ఇబ్బందులు పడుతున్నారు. కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో మరో ట్రాన్స్‌ఫార్మర్లు తెప్పించి విద్యుత్ సిబ్బంది బిగిస్తున్నప్పటికీ గురువారం రాత్రి వరకూ పనులు పూర్తి కాకపోవడంతో గ్రామాలన్నీ అంధకారంలోనే మగ్గిపోయాయి. ఈ విషయంపై ఎఇ వినయ్ కుమార్‌ను వివరణ కోరగా శుక్రవారం ఉదయానికి అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా అందిస్తామని తెలిపారు.

4రోజులు .. 50 శాతం

ఇకెవైసి సాధ్యమేనా?

పంటల కొనుగోలు, బీమా వర్తింపు సహా అన్ని రకాల ప్రభుత్వ పథకాలకు రైతుల ఇకెవైసి అత్యంత కీలకంగా మారింది. ఈనేపథ్యంలో రైతులు ఆర్‌బికెలకు వచ్చి ఇకెవైసి నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారులు, ఆర్‌బికె సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు. రైతులు మాత్రం వ్యవసాయ పనుల్లో బిజిబిజీగా వున్నారు. మరోవైపు గడువు సమయం ముంచుకొస్తోంది. ఈనెల 9వ తేదీతో ఇకెవైసి ఇక్రాప్ నమోదు పూర్తిచేసి, 15నాటికల్లా నివేదిక ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం సూచించినట్టు సమాచారం. ఈనేపథ్యంలో ఇటు రైతులు, అటు అధికార యంత్రాంగం ఎంతో సమన్వయం, ముందుచూపుతో వ్యవహరించాల్సి వుంది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



- నమోదు కాకపోతే పథకాలకు దూరమే
- వ్యవసాయ పనుల్లో రైతన్న బిజీబిజీ
- ఆర్‌బికెలకు వచ్చి నమోదు చేయించు కోవాలంటున్న సిబ్బంది
- అధికారులు ఉరుకులు - సిబ్బంది పరుగులు

ఇ-క్రాప్ నమోదుకు ఈనెలాఖరు వరకు సమయం ఇచ్చిన సంగతి తెలిసిందే. రాష్ట్ర వాప్తంగా అన్ని జిల్లాల్లోనూ లక్ష్యానికి చేరుకోకపోవడంతో ఈనెల 9వరకు సమయం పొడిగించారు. దీంతో, ఇప్పటి వరకు వ్యవసాయ, ఉద్యాన పంటలకు కలుపుకుని జిల్లాలో 95శాతం ఇ-క్రాప్ పూర్తిచేశారు. మిగిలిన నాలుగు రోజుల్లో 5శాతం పంటలను నమోదు చేస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ ఇప్పటి వరకు బుక్‌చేసిన ఇ-క్రాప్‌లో కేవలం 50 శాతం మాత్రమే ఇకెవైసి నమోదైంది. దీంతో, ఇంతకు మించి ఇ-క్రాప్ నమోదు జరిగినట్టుగా పరిగణించే పరిస్థితి లేదు. నాలుగు రోజుల్లో రైతుల నుంచి ఇకెవైసి తీసుకోవాలంటే యుద్ధ ప్రాతిపదికన పనిచేయాల్సివుంది. దీనికితోడు జిల్లాలో ఆన్‌లైన్‌లో ఇకెవైసి చేసుకునేందుకు ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మాత్రమే ప్రభుత్వం ఆన్‌లైన్ వెబ్‌సైట్ అందుబాటులో ఉంచినట్టు అధికారులు చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 4,15,297 ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగుకావాల్సివుండగా ఇప్పటి వరకు 3.62లక్షల ఎకరాల్లో సాగైనట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇందులో రూ.3.43 లక్షల ఎకరాలు అంటే 95శాతం మేర ఇ-క్రాప్ బుక్‌చేసినట్టు అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా వరి ఈ ఏడాది 2.23లక్షల ఎకరాల్లో సాగవ్వాల్సివుండగా ఈ ఏడాది 2.21లక్షల ఎకరాల్లో సాగైంది. 1,73,804 మంది రైతులకు చెందిన 2.18లక్షల ఎకరాల మేర ఇ-క్రాప్ నమోదైంది. ఈలెక్కన 99శాతం వరి ఇ-క్రాప్ నమోదైనట్టుగా చెబుతున్నారు. మొక్కజొన్న 37,728 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా 76శాతం నమోదైంది. పత్తి 94శాతం నమోదు చేశారు. నువ్వుల పంట 9,817 ఎకరాల్లో సాగవ్వగా 70 శాతం నవ్వులపంట గుర్తింపునకు నోచుకోలేదు. మొత్తం పంటల్లో నమోదైన ఇ-క్రాప్‌లో 50 శాతం మాత్రమే ఇకెవైసి అవ్వడంతో ఆమేరకు మాత్రమే ఇ-క్రాప్ బుకింగ్ జరిగినట్టుగా భావించవచ్చు. వ్యవసాయశాఖ అధికారులు మాత్రం రైతులు ఇకెవైసికి ముందుకు రావడం లేదని, సాంకేతిక కారణాలు కూడా ఉన్నాయని చెబుతున్నారు.

పంటలకు ఇ-క్రాప్ నమోదు ఆధారంగానే ప్రభుత్వం పంట నష్టపరిహారం, బీమా, సున్నావడ్డీ పథకాలు వర్తింపజేస్తున్న విషయం విదితమే. వీటితోపాటు ఉత్పత్తులను కొనుగోలు చేసి, వాటికి కనీస మద్దతుధర కల్పించేందుకు కూడా ఇకెవైసితో కూడిన ఇ-క్రాప్‌తోనే ప్రభుత్వం ముడిపెట్టింది. ఇ-క్రాప్ కింద గుర్తింపు పొందని రైతులు, ముఖ్యంగా ధాన్యం విక్రయంలో ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు.

ఇకెవైసి తప్పనిసరి



ఈ పంట నమోదు లోని నమోదైన ప్రతి రైతు తప్పనిసరిగా ఇకెవైసి చేసుకోవాలి. ఇప్పటివరకు జిల్లాలోని రైతులు 50 శాతం వరకే ఇకెవైసి చేసుకున్నారు. ప్రతి రైతు తమ దగ్గరలోని ఆర్‌బికెలో వ్యవసాయ సహాయ కులు కలిసి తప్పనిసరిగా ఇకెవైసి చేయించు కోవాలి. ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఇకెవైసి చేసుకునేందుకు మన జిల్లాలో అనుమతి ఇచ్చారు. ఇకెవైసి చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలకు సంబంధించి అర్హులు. ఈ అవకాశం ఈనెల తొమ్మిదో తారీఖు వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది.

విటి రామారావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ఎంత సమయమైనా అందరికీ తనిఖీలు

ఆరోగ్య సురక్ష కాంప్‌లను తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి-పూసపాటిరేగ, డెంకాడ

జగనన్న ఆరోగ్య సురక్ష కాంప్‌లకు వచ్చిన ప్రజలందరికి ఎంత సమయమైనా తప్పకుండా తనిఖీలు చేసే పంపాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. గురువారం కలెక్టర్ పూసపాటిరేగ మండలం గుంపాం, డెంకాడ మండలం బొడ్డవలస గ్రామాల్లో ఏర్పాటు చేసిన సురక్ష శిబిరాలను తనిఖీ చేశారు. గుంపాంలో 364 మంది నమోదు చేసుకున్నారు. శిబిరం వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్, ఓపి రిజిస్ట్రేషన్, స్పాట్ రిజిస్ట్రేషన్, ఐటి రూమ్, వైద్యుల కేటాయింపు, ల్యాబ్, వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ సహాయ కేంద్రం, వైద్యుల గదులు, మందులిచ్చే కౌంటర్, న్యూట్రిషన్ స్టాల్, కంటి పరీక్షా కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. రోగులతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. కళ్లద్దాలను పంపిణీ చేశారు. వైద్యులతో మాట్లాడుతూ ఏడు రకాల పరీక్షలను నిర్వహించి, హెల్త్ ప్రొఫైల్‌లో వారి వివరాలను నమోదు చేయాలని, అవసరమైన వారికి కేస్ షీట్లను అందించాలని తెలిపారు. శిబిరాల్లో ఇసిజితో సహా మొత్తం 14 రకాల పరీక్షలను నిర్వహించి, 105 రకాల మందులను ఉచితంగా ఇవ్వాలని తెలిపారు. కంటి పరీక్షలను కూడా నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలను కూడా అందజేసారు. బొడ్డవలస శిబిరంలో 300 మంది పేర్లను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కరరావు, ఐసిడిఎస్ పీడీ శాంత కుమారి, పూసపాటిరేగ ఎంపిడిఒ రాధిక, తహశీల్దార్ భాస్కర రావు, ఎంపిపి కల్యాణి, వైద్యులు, స్పెషలిస్టు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. డెంకాడ మండల తహశీల్దార్ ఆదిలక్ష్మి, ఎంపిడిఒ స్వరూప రాణి, ఎంపిపి బంటుపల్లి వాసుదేవ రావు తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ : వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, డిఎంహెచ్ఒ భాస్కరరావు

ఎన్నికలకు సిద్ధం కండి : మంత్రి బొత్స

ప్రజాశక్తి-గరివిడి

కార్యకర్తలు, నాయకులు ఎన్నికలకు సిద్ధం కావాలని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. గురువారం చీపురుపల్లి నియోజకవర్గం వైసిపి నాయకులు, కార్యకర్తల సమావేశం గరివిడి పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈసందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతివ్యక్తి ఆరోగ్య సమస్యలూ తెలుసుకొని పరిష్కరించే విధంగా కార్యకర్తలు పనిచేయాలని కోరారు. పార్టీకి అతీతంగా ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరించాలన్నారు. ప్రజల కోసం ప్రభుత్వం ఏ అభివద్ధి కార్యక్రమాలు చేపట్టిందో వివరించాలన్నారు. ఈ ఆరు నెలలూ పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. జెడ్‌పి చైర్మన్ మాట్లాడుతూ టిడిపికి మీడియా అండగా ఉన్నా, జగన్మోహన్‌రెడ్డిని ఏమీ చేయలేరని అన్నారు. పార్టీ విజయం కోసం ప్రతీ ఒక్క నాయకుడు కృషి చేయాలని కోరారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని ఆ సమస్య పరిష్కారం చేసేవిధంగా కృషి చేయాలని సూచించారు. ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుల అబద్ధపు మాటలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ

వంతెన నిర్మాణం చేపట్టాలి : బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

అవినీతి, అక్రమాలు ఎన్నో రోజులు దాగిపోవని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి బేబినాయన అన్నారు. గురువారం శిథిలావస్థకు చేరిన పారాది వంతెనను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.30లక్షలు మంజూరు చేస్తే నాసిరకంగా మరమ్మతు పనులు చేశారన్నారు. వంతెనకు మెరుగులు దిద్దడం వలనే నేడు కుంగిపోయే స్థితికి చేరిందన్నారు. వంతెన పరిస్థితి బాగోలేకపోవడం వలనే టిడిపి హయాంలో నిధులు కేటాయించి తన సోదరుడు సుజయకృష్ణ రంగారావు అప్పటి కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజుతో కలిసి శంకుస్థాపన చేస్తే వైసిపి ప్రభుత్వం టెండర్ రద్దు చేసిందన్నారు. బిల్లులు చెల్లింపుపై ప్రభుత్వంపై నమ్మకం లేకపోవడంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదని విమర్శించారు. పోలీసులు సకాలంలో వంతెన కుంగిపోవడాన్ని గమనించడం వల్లే ప్రమాదం తప్పిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వంతెన పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టిన తర్వాత వాహనాలు రాకపోకలకు అనుమతి ఇవ్వాలని, నూతన వంతెన నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రౌతు రామమూర్తి, ఆర్.శరత్, వెంకటేష్, వెంకటనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



పారాది వంతెనను పరిశీలిస్తున్న బేబినాయన

ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌ను రద్దు చేయాలి

నోడల్ అధికారికి అంగన్‌వాడీల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు ఆగస్టు ఒకటో తేదీ నుండి అమలు చేస్తున్న ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నోడల్ అధికారి కె. విజయ కుమారికి గురువారం వినతి అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు ఒకటో తేదీ నుండి గర్భిణీలు, బాలింతలకు టేక్‌హోం రేషన్ అమలు చేస్తోందన్నారు. కేంద్రాలకు ఇచ్చిన సెల్ ఫోన్లు సక్రమంగా పనిచేయడం లేదని, మారుమూల ప్రాంతాల్లో, ఏజెన్సీ మండలాల్లో అసలు ఇంటర్నెట్ సిగ్నల్ ఉండటం లేదని తెలిపారు. ఐదో తేదీలోపు ఎఫ్ఆర్ఎస్ యాప్ వేయించాలని చెబుతున్న అధికారులు నెట్‌వర్క్ లేకుండా ఎలా చేయగలమని ప్రశ్నించారు. అప్పటికి పాలు గాని, వైయస్సార్ కిట్‌లు గాని అసలు రావడం లేదన్నారు. ఫోన్లు పనిచేయకపోవడం వల్ల లబ్ధిదారులు వచ్చినప్పుడు సిగ్నల్స్ ఉండక పదేపదే తిరగవలసి వస్తుందని తెలిపారు. అనారోగ్య సమస్యలు, బెడ్ రెస్ట్ ఉన్న వాళ్లకు కూడా ఎఫ్ ఆర్ ఎస్ అమలు చేయాలని బలవంతం చేస్తున్నారని, దీనివలన అంగన్‌వాడీలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా ఆలోచించి ఎఫ్ఆర్ఎస్ యాప్ ను రద్దు చేయాలని కోరారు. వినతిని అందజేసిన వారిలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అనసూయ, జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి, జిల్లా ఆఫీసు బేరర్ కె. ప్రభావతి, పద్మ కుమారి పాల్గొన్నారు.

పారాది వంతెనను పూర్తి స్థాయిలో బాగు చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

పారాది వంతెనను ప్రభుత్వం పూర్తి స్థాయిలో బాగు చేసి వాహనాల రాకపోకలకు అనుమతి ఇవ్వాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పి.శంకరరావు డిమాండ్ చేశారు. సిఐటియు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పారాది వంతెన పురాతన కాలంలో నిర్మించినప్పటికి నూతన వంతెన నిర్మాణానికి ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. వంతెన కుంగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాహనాలను దారి మళ్లించడంతో వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాత వంతెనను పూర్తి స్థాయిలో బాగు చేసి రాకపోకలకు అనుమతి ఇవ్వాలని, వెంటనే నూతన వంతెన నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

అండర్ 19 జిల్లా బాల, బాలికలు జట్లు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అండర్ 19 స్కూల్ గేమ్స్ వాలీబాల్ జిల్లా జట్లు ఎంపిక పూర్తి అయ్యింది. గురువారం స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో జరిగిన ఎంపిక పోటీలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వంద మంది కి పైగా విద్యార్థులు హాజరయ్యారని అండర్ 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి పివిఎల్ఎన్ కృష్ణ తెలిపారు. బాల, బాలికల జట్లుకు జట్టుకు 12 మంది చొప్పున క్రీడాకారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. చిత్తూరు జిల్లాలో నెలాఖరున జరగనున్న రాష్ట్ర పోటీలకు జిల్లా జట్లును పంపించనున్నారు. ఎంపిక ప్రక్రియలో వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి భగవాన్ దాస్, జిల్లా కార్యదర్శి కెవిఎఎన్ రాజు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణంరాజు, ఎన్.వెంకట నాయుడు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

టిడ్కో లబ్ధిదారులకు రుణ మంజూరు వేగవంతం

ప్రజాశకి-విజయనగరం టౌన్

డిడ్కో గృహ లబ్ధిదారులకు రుణ మంజూరును వేగవంతం చేయాలని బ్యాంక్ అధికారులకు నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్ .శ్రీరాములనాయుడు సూచించారు. గురువారం సారిపల్లిలోని టిట్కో గృహ సముదాయాన్ని వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. అక్కడ నెలకొన్న సమస్యలపై లబ్ధిదారులు అధికారుల దృష్టికి తెచ్చారు. త్వరలో సౌకర్యాలను మెరుగుపరుస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ లబ్ధిదారులకు రుణాలు త్వరితగతిన మంజూరైనట్లయితే మరింత మంది వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం నెలకొన్న సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంటును పరిశీలించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ సుధాకర్ రావు, లీడ్ బ్యాంక్ మేనేజర్, టిడ్కో ఇఇ జ్యోతి, సియంయం సన్యాసి రావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులందరికీ గుర్తింపు కార్డులు

ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి -విజయనగరం

జిల్లాలోని అసంఘటిత రంగ కార్మికులందరూ ఈ-శ్రమ్ గుర్తింపు కార్డులను పొందాలని కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. ఎన్నో ప్రయోజనాలు కల్గించే ఈ గుర్తింపు కార్డులను సచివాలయాలు లేదా కామన్ సర్వీసు సెంటర్ నుంచి ఉచితంగా పొందవచ్చునని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ శ్రమ్ పోర్టల్ ద్వారా యూనివర్సిల్ అకౌంట్ నంబర్ (యుఎఎన్) కేటాయించి గుర్తింపు కార్డులను జారీ చేస్తామని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 4,15,142మందికి ఈ-శ్రమ్ పోర్టల్ ద్వారా గుర్తింపు కార్డులను జారీ చేశామని, ఇంకా సుమారు 2,50,188 మందికి జారీ చేయాల్సి ఉందని తెలిపారు. వీరంతా తక్షణమే తమ పేర్లను ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. రోజువారీ కూలీలు, కళాసీలు, హమాలీలు, రిక్షా కార్మికులు, మోటారు కార్మికులు, భవన నిర్మాణం, ఇతర నిర్మాణ రంగాల్లో పనిచేసేవారు, రైతు కూలీలు, చిన్న సన్నకార రైతులు, కౌలు రైతులు, మత్స్యకారులు, వీధి వ్యాపారులు, స్వయం ఉపాధి పొందేవారు, చిన్న వ్యాపారస్తులు, జాతీయ ఉపాధిహామీ కూలీలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలలో పనిచేస్తూ గౌరవ భృతి పొందేవారు, దుకాణాలు, సంస్థలు, ఫ్యాక్టరీల్లో పనిచేస్తూ ఇఎస్ఐ, పిఎఫ్ సదుపాయం లేనివారు, కాంట్రాక్టు కార్మికులు, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే వారంతా ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకొని, గుర్తింపు కార్డులను పొందవచ్చునని తెలిపారు.

ఈ గుర్తింపు కార్డు కలిగిఉండి, ప్రమాద వశాత్తూ మరణించినా, శాశ్వత అంగవైకల్యం పొందినా, వారికి కేంద్ర ప్రభుత్వం రూ.2లక్షలు ఆర్థిక సాయాన్ని అందిస్తోందని తెలిపారు. ఈ విధంగా 2022 మార్చి 31లోగా మరణించిన, శాశ్వత అంగవైకల్యం పొందిన వారి ధరఖాస్తులను, డిఆర్‌డిఎ పీడీ, ఉప కార్మిక కమిషనర్, డిఎంఅండ్‌హెచ్ఒ, జిల్లా ఎస్‌పిలతో కూడిన కమిటీ పరిశీలించి, వాటిని అప్‌లోడ్ చేసే ప్రక్రియ జరుగుతోందని తెలిపారు. అసంఘటిత కార్మికులు రేషన్ కార్డు లేకపోయినట్లయితే, వెంటనే రేషన్ కార్డును జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. దీనిప్రకారం జిల్లా పౌర సరఫరాల శాఖకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ శ్రమ్ గుర్తింపు కార్డులు కలిగిఉన్నవారు ప్రధానమంత్రి శ్రమ యోగి మాన్ ధన్ పథకం (పిఎంఎస్‌వైఎం) ద్వారా పింఛన్ సదుపాయాన్ని కూడా పొందవచ్చునని సూచించారు. బహుళ ప్రయోజనాలను కల్గించే ఈ గుర్తింపు కార్డులను ఈ-శ్రమ్ పోర్టల్‌లో తమ పేరు నమోదు చేసుకోవాడానికి ఆధార్ నంబర్, ఆధార్ లింక్ అయిన సెల్ నంబరు, బ్యాంకు అకౌంట్ వివరాలను సచివాలయంలో సమర్పించి పొందవచ్చునని తెలిపారు. ఇతర వివరాలకు కార్మిక శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌ను సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

మరోసారి అవకాశమిస్తే సమస్యలే ఉండవు

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యలు లేని నియోజక వర్గంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మరోసారి తమకు అవకాశమిస్తే.. ప్రజలు అడగడానికి, తాము చేయడానికి పనులేవీ పెండిగు లేని పరిస్థితి తెస్తామని చెప్పారు. గురువారం స్థానిక సుజాత కన్వెన్షన్ సెంటర్లో వైసిపి క్లస్టర్ స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ఇచ్చిన హామీల్లో ఎక్కడ్కెనా పనులు పూర్తి కాకపోతే చెప్పాలని, వెంటనే పూర్తి చేస్తామని తెలిపారు. నగరాన్ని కార్పొరేషన్ స్థాయికి తగ్గట్లుగా అభివద్ధి చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం అమలవుతున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశంలో ఎక్కడ్కెనా జరుగుతుందా? ఇంటికే వచ్చి వైద్యపరీక్షలు చేయడం ఎప్పుడ్కెనా ఉందా? అని ప్రశ్నించారు. నేడు రాష్ట్రంలో జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోలేకే, టిడిపి, జనసేన కలసి వస్తున్నాయని అన్నారు. ఈనెల 11 నుంచి ప్రతి ఇంటికీ వెళ్లి జగన్ నాయకత్వమే ఎందుకు కావాలో ప్రజలకు చెప్పాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ అధ్యక్షులు, జోనల్ ఇన్చార్జిలు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోలగట్ల వీరభద్రస్వామి

రామారాయుడు రోడ్డు పనులకు శంకుస్థాపన

నగరంలో కోటి 50 లక్షల రూపాయలతో నిర్మించనున్న రామా రాయుడు రోడ్డు పనులకు గురువారం ఉదయం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వైసిపి నగర అధ్యక్షుడు ఆశపు వేణు మాట్లాడుతూ కోటి 50 లక్షల రూపాయలతో 987 మీటర్ల పొడవున్న రహదారిని ఏర్పాటు చేయడంతో వివిధ వర్గాల్లో హర్షం వ్యక్తం అయింద న్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాపుగంటి ప్రకాష్ మాట్లాడుతూ నగరం అన్ని రంగాలలో అభివద్ధి చెందుతుం దన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయ యాదవ్, కమిషనర్ ఆర్ శ్రీరాములు నాయుడు, విద్యార్థి విభాగం అధ్యక్షుడు కేదారశెట్టి లక్ష్మణమూర్తి, వైసిపి నాయకులు కుమ్మరిగంటి శ్రీనివాసరావు, యడ్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సిసికి బాలికల ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో బాలికల బెటాలియన్ ఎన్‌సిసి విజయనగరం సుబేదార్ మేజర్ రామదాత్, జిసిఐ సరిత ఆధ్వర్యంలో బాలికల ఎంపిక గురువారం జరిగింది. ఈ ఎంపికలో భాగంగా సీతం, సత్య విద్యా సంస్థల బాలికలు 150 మంది పాల్గొనగా పరుగు పందెం, ఎత్తు, బరువు, మౌఖిక పరీక్ష, చేతులు, కాళ్ల కదలికల పరిశీలన ఆధారంగా 50 మందిని ఎంపిక చేశారు. ఈ ఎంపిక కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ గోపేంద్ర, సుబేదార్ మేజర్ రామదాత్, జిసిఐ సరిత పర్యవేక్షణలో జరిగింది. సుబేదార్ మేజర్ రామ్ దత్ మాట్లాడుతూ, ఎన్‌సిసి కోర్సును జెఎన్‌టియు జివి ఆర్23 రెగ్యులేషన్లో పెట్టినట్లు తెలిపారు. ఎంపికైన బాలికలను సత్యా విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ్ రావు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. రామమూర్తి, సత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి దేవమణి , ఎన్‌సిసి ఆఫీసర్ కెప్టెన్ ఎన్. సత్యవేణి, లెఫ్టినెంట్ ఎం.వరలక్ష్మి, ఎస్. ప్రశాంత్, సిఎస్ఒ సత్యనారాయణ, పీడీ జె.మహేశ్వర రావు పాల్గొన్నారు.



సమ్మె శిబిరంలో కార్మిక నాయకులతో చర్చిస్తున్న పోలీసులు

పాల్ట్రీ కార్మికుల నిరవధిక సమ్మెతో

దిగొచ్చిన యాజమాన్యం

ప్రజాశక్తి-చీపురుపల్లి

మండలంలోని కర్లాం గ్రామం పరిధిలో గల వెంకట్రామ పౌల్ట్రీస్ లో పనిచేస్తున్న కార్మికులు తమ వేతన ఒప్పందం సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మెకు దిగిన నేపథ్యంలో యాజమాన్యం దిగొచ్చింది. వేతన ఒప్పందాన్ని అమలు చేసేందుకు అంగీకరించడంతో కార్మికులు సమ్మె విరమించారు. ఈ పౌల్ట్రీ లో పనిచేస్తున్న కార్మికులకు ఈ ఏడాది మే నెలతో వేతన ఒప్పందం సమయం ముగిసింది. జూన్ 1 నుంచి నూతన వేతన ఒప్పందం అమలు జరగాల్సి ఉంది. నూతన వేతన ఒప్పందం చేయాలని కోరుతూ ఏప్రిల్ 20న చార్టర్ ఆఫ్ డిమాండ్స్ నోటీసును యాజమాన్యానికి గంగా భవాని వెంకట్రామా పౌల్ట్రీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ఇచ్చారు. యాజమాన్యం వద్ద, డిసిఎల్ వద్ద గత నాలుగు నెలల కాలంలో 12 సార్లు చర్చలు జరిగినా సమస్యలు పరిష్కారం కాలేదు. గత నెల 8న కార్మికులంతా ఒకరోజు సమ్మె చేశారు. 14 నుంచి పౌల్ట్రీ పరిశ్రమ వద్ద రిలే నిరాహార దీక్షలు చేసారు. అయినా యాజమాన్యం స్పందించకపోవడంతో కార్మికులంతా విధులు బహిష్కరించి నిరవధిక సమ్మెలోకి దిగారు. స్థానిక ఎస్ఐ సన్యాసినాయుడు ఆధ్వర్యాన యూనియన్ ప్రతినిధులతోనూ, యాజమాన్య ప్రతినిధులతోనూ చర్చలు ఏర్పాటు చేశారు. ఈ చర్చల్లో వేతన ఒప్పందానికి యాజమాన్యం అంగీకరించింది. ఈ ఏడాది జూన్ నుంచి అమలు చేస్తామని తెలిపింది. ఏడాది పాటు ఈ ఒప్పందం అమల్లో ఉంటుంది. ఈ ఒప్పందం ద్వారా 200 మంది కార్మికులకు తక్కువ రూ.1900 నుంచి రూ.3200 వరకూ వేతనాలు పెరగనున్నాయి. చర్చలలో యాజమాన్య ప్రతినిధులు జిఎం హరికిషన్, హెచ్‌ఆర్ మేనేజరు అక్కిలనాయుడు, సతీష్, యూనియన్ ప్రతినిధులు టివి రమణ, ఎ.గౌరినాయుడు, ఐ. గురునాయుడు, ఈశ్వరరావు, గొల్లబాబు పాల్గొన్నారు. చర్చలు విజయవంతం కావటంతో సమ్మె విరమించి కార్మికులందరూ విధులకు హాజరయ్యారు.

వేతన ఒప్పందం అమలు

కష్టపడితేనే రెండోసారి అధికారం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- దత్తిరాజేరు

వైసిపి రెండోసారి అధికారంలోకి రావాలంటే గ్రామంలో ప్రతి కార్యకర్త నుండి ఎంపిపి వరకు ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో పార్టీ కోసం కష్టపడితేనే విజయం చేకూరుతుందని ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య హితవు పలికారు. మండలంలోని కోమటపల్లి జంక్షన్ వద్ద కళ్యాణ మండపంలో గురువారం మండల పార్టీ అధ్యక్షులు రాపాక కృష్ణార్జున ఆధ్వర్యంలో 'ఆంధ్ర రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే' అనే శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ నుండి నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో పార్టీ తరఫున, ప్రభుత్వం తరఫున రెండు కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. అందులో ముఖ్యంగా మొదటిది జగనన్న సురక్ష కార్యక్రమం, ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరికి వైద్యులతో మేలైన ఉచిత వైద్యం అందించాలన్నారు. రెండవ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం తరఫున ప్రతిరోజు మధ్యాహ్నం మూడు గంటల నుండి 5 గంటల వరకు అధికారులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందజేసిన పథకాలపై వివరించాలన్నారు. క్యాడర్ బలోపేతం చేయడం, గ్రామస్థాయి నాయకుల మధ్య సమన్వయ లోపాన్ని సరిదిద్దడం, పల్లె నిద్ర చేపట్టడం, వంటి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. మరుసటి రోజు ఉదయం ఎనిమిది గంటలకు ఇంటింటికి వెళ్లి గతంలో టిడిపి చేపట్టిన పథకాల్లో లోపాలు గుర్తి, వైసిపి ప్రభుత్వం చేపడుతున్న పథకాల గురించి వివరించి ప్రజల చేత మార్కులు వేయించే పని చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఇలా ఈ కార్యక్రమాన్ని 45 రోజులపాటు చేయాల్సి ఉంటుందన్నారు. గతంలో 28 వేల ఓట్లు మెజారిటీతో ఎమ్మెల్యేగా బొత్స అప్పల నరసయ్యను గెలిపించుకున్నారని, వచ్చే ఎన్నికల్లో అంతకుమించి రెట్టింపు మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మీ అందరిపై ఉందని ఎంపి బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్‌పిటిసి రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపిపిలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తి రెడ్డి రమేష్, బీసీ సెల్ అధ్యక్షులు మంత్రి అప్పలనాయుడు, సర్పంచులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

మంచినీళ్లు ఇవ్వండి సారూ!

గత కొన్నాళ్లుగా తాగడానికి మంచినీళ్లు లేక నానా అవస్థలు పడుతున్నామని ఇంగిలాపల్లి గ్రామంలో ఎస్‌టి కాలనీవాసులు గడప గడప కార్యక్రమంలో ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య వద్ద వాపోయారు. ఎన్నిసార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకున్నా, జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో విన్నవించుకున్నప్పటికీ మంచినీటి సమస్య తీరలేదని, అవసరమైన చోట కల్వర్టుల నిర్మాణం చేపట్టకపోవడంతో మురుగునీరు పేరుకు పోతుందని, కాలనీకి చెందిన పలువురు మహిళలు, యువకులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో మంచినీటి బోర్లు పాడైపోవడంతో సమస్య ఏర్పడిందని, తాగునీటి కోసం నిధులు మంజూరు చేసి, మరో రెండు నెలల్లో ఏదంపుల గెడ్డ నుండి తాగునీటిని అందించేందుకు కృషి చేస్తామని, అలాగే కల్వర్టుల నిర్మాణానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా తొలిత ఎంపి బెల్లాన చంద్రశేఖర్ గ్రామానికి చేరుకొని నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి నవరత్నాల పథకాలు ద్వారా లబ్ధి పొందిన వారితో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. కాసేపటికి చేరుకున్న ఎమ్మెల్యే అప్పల నరసయ్య, ఎంపితో కలిసి అన్ని వీధులలో పర్యటించి ఇంటింటికి వెళ్లి లబ్ధి పొందిన వారితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.21.80 లక్షలతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎంపితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణ నివారించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

చెరువులు, ప్రభుత్వ భూముల ఆక్రమణ నివారించాలని రైతు సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన చెరువులు, ప్రభుత్వ భూముల ఆక్రమణ నివారించాలని కోరుతూ తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ జరజాపుపేటలో సర్వే నంబర్ 100లో కొంతల వాని చెరువు, ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని అన్నారు. పలుమార్లు అధికార్లకు ఫిర్యాదులు చేసినా ఆక్రమాలు ఆగలేదన్నారు. ముఖ్యంగా నగర పంచాయతీ పరిధిలో ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలు కట్టడాలు చేస్తున్నా అధికార్లు స్పందించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు ఆక్రమణ గురవ్వడం వల్ల భూములకు సాగునీరు అందించడంలో ఇబ్బందులు వస్తాయని ఆక్రమణలు నివారించి రైతులను ఆదుకోవాలని, ప్రభుత్వ భూములను పరిరక్షించి ఇళ్ల లేని పేదలకు స్థలాలు ఇవ్వాలని వినతి పత్రంలో కోరారు.


వినతి పత్రమిస్తున్న రామారావు


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

దాడులకు నిరసనగా జర్నలిస్టుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

న్యూస్ క్లిక్ పత్రిక కార్యాలయంపై ఇడి దాడులు, సంస్థ వ్యవస్థాపకులు ప్రబీర్ పుర్కాయస్త, హెచ్ఆర్ హెడ్ అమిత్ చక్రవర్తిల అరెస్టుకు వ్యతిరేకంగా జర్నలిస్టులు గురువారం విజయనగరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. తొలుత గాంధీ విగ్రహం నుంచి ప్రధాన రహదారి గుండా కలెక్టరేట్ ఔట్‌గేటు వరకు ప్రదర్శన నిర్వహించారు. 'జర్నలిస్టులపై దాడులను ఖండించాలి. మీడియా స్వేచ్ఛను కాపాడాలి.. సిగ్గు సిగ్గు'.. మీడియాపైదాడులు సహించబోం'.. జర్నలిస్టుల గొంతు నొక్కడం దుర్మార్గం' అంటూ నినాదాలు చేశారు. ధర్నానుద్దేశించి జర్నలిస్ట్ సంఘ నాయకులు కె.రమేష్‌నాయుడు, ఎంఎంఎల్ నాయుడు, గమిడి కోటేశ్వరరావు, జి.సూరిబాబు మాట్లాడారు. పత్రికా స్వేచ్ఛపై దాడిని ఈ సందర్భంగా ఖండించారు. బిజెపి ప్రభుత్వం విధానాలను విమర్శించే జర్నలిస్టుల పైనా, ఇతర ప్రగతిశీల మీడియాపైనా ఇడితో దాడుల చేయిస్తోందని అన్నారు. క్రూరమైన ఉపా చట్టాన్ని ఉపయోగించి ఢిల్లీ పోలీసులు జర్నలిస్టుల ఇళ్లపై దాడి చేయడాన్ని వ్యతిరే కించారు. జర్నలిస్టులకు సంఘీభావం తెలిపారు. న్యూస్ క్లిక్ కార్యాలయానికి సీలు వేయడాన్ని కూడా తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టులపై కార్యాలయాలపై దాడి చేయడమంటే ప్రజా స్వామ్యంపై దాడి చేయడమే నన్నారు. దీన్ని ప్రజలు వ్యతిరేకించాలని అన్నారు. ధర్నాలో జర్నలిస్టులు వెంకట్, ప్రయాగల రాజు, జయరాజ్, పరశురామ్, ఎం.రవిచంద్రశేఖర్, పి.అప్పారావు, సిహెచ్ రాము, ఎ.సత్య నారాయణ పాల్గొన్నారు.

కృష్ణ కుటుంబానికి పరామర్శ

వేపాడ: మండలంలోని రామస్వామి పేటకు చెందిన మాజీ సర్పంచ్ గొలగాన కృష్ణ భార్య చంద్రమ్మ మరణించిన సమాచారం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ గురువారం ఆయన కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గొర్లె నాగరాజు, సిరికి రమణ, సేనాపతి గణేష్, మంచిన అప్పలసూరి, ఎర్ర ప్రగడ సూర్యం తదితరులు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

వాహనాల తనిఖీ

వేపాడ : మండలంలోని సోంపురం జంక్షన్‌లో డిఎస్‌పి ఆర్ గోవిందరావు ఆకస్మికంగా గురువారం వాహనాలను తనిఖీ చేశారు. వల్లంపూడి పోలీస్ స్టేషన్ పరిశీలన నిమిత్తం వచ్చిన ఆయన రోడ్డుపై వెళుతున్న వాహనాలను ఆపి తనిఖీలు చేశారు. అనంతరం వల్లంపూడి పోలీస్ స్టేషన్‌ను డిఎస్‌పి ఆర్. గోవిందరావు సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట వల్లంపూడి ఎస్ఐ రాజేష్ ఉన్నారు.

పాఠశాల పరిశీలన

వేపాడ: మండలంలోని పాటూరు ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ పి బాల భాస్కరరావు గురువారం పరిశీలించారు. ముందుగా విద్యార్థులకు ఇస్తున్న మెనూ రికార్డులను, ఉపాధ్యాయులు డైరీలను, విద్యార్థులు నోట్ బుక్స్, వర్క్ బుక్స్ పరిశీలించారు. అనంతరం పాఠశాల ఆవరణ పరిశీలించి మొక్కలను బాగా పెంచాలని పాఠశాల వాతావరణం అంతా ఆహ్లాదకరంగా ఉండే విధంగా తయారు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ఆక్సి, ధర్మ మీటర్లు పంపిణీ

వేపాడ: స్థానిక పిహెచ్‌సిలో గురువారం ఎంపిపి దొగ్గ సత్యవంతుడు చేతులు మీదుగా సిబ్బందికి ఆక్సి మీటరు, ధర్మమీటర్లు పంపిణీ చేశారు. సుస్థిర వ్యవసాయ కేంద్రం సిఎస్‌ఎ హరిత ఎఫ్‌పిఒ, వేపాడ ట్రైబల్ ఎఫ్‌పిసి ఎస్‌కెఆర్‌పురం సంయుక్తంగా సమకూర్చిన ఈ మీటర్లను ఎంపిపి చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌ఎ రీజనల్ కోఆర్డినేటర్ వెంకటరావు, వ్యవసాయ శాఖ సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


ఇళ్ల స్థలం పట్టాను అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

ప్రతి పేదవాడికీ సొంతిల్లే లక్ష్యం

ప్రజాశక్తి - భోగాపురం

రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి సొంత ఇల్లు ఉండాలన్నదే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని సవరవల్లి పంచాయతీలో జగనన్న కాలనీకి సంబంధించి పేదలకు పట్టాలు పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగన్మోహన్ రెడ్డి పాలన అందిస్తున్నారన్నారు. అందుకు రానున్న రోజుల్లో మళ్లీ ఆయనను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ చింతాడ బంగార్రాజు, వైసిపి అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, సర్పంచ్ ఉప్పాడ విజయభాస్కర్ రెడ్డి, వైస్ ఎంపిపి రావాడ బాబు, ఎంపిటిసి తాతయ్యలు, సచివాలయం కన్వీనర్ పడాల శ్రీనివాసరావు, నాయకులు కిలారి వెంకటరమణ, బైరెడ్డి రాజు, భాను తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఫ్లెక్సీలనే ఎందుకు తొలగించారు?

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపాలిటీ అధికారులు కొంటి సాకులు చెప్పి, కేవలం జనసేన పార్టీ ఫ్లెక్సీలను మాత్రమే ఎందుకు తొలగించారని ఆ పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరు ప్రశ్నించారు. గురువారం పట్టణంలోని పలు కూడలిలో ఉన్న జనసేన ఫ్లెక్సీలను అధికారులు తొలగించారు. దీంతో జనసేన నాయకులు పల్లెం రాజా, సంచాన గంగాధర్, రేవెళ్ల కిరణ్, హరిచరణ్, శ్రీను, శివ శంకర్, వెంకటరమణ, జగన్‌తో కలిసి బాబూ పాలూరు వెంటనే మున్సిపల్ ఆఫీస్‌కి వెళ్లి జనసేన ఫ్లెక్సీలను మాత్రమే ఎందుకు తొలగించారో చెప్పాలని ప్రశ్నించారు. ఎవరో వైసిపి నాయకుడు వైవీ సుబ్బారెడ్డి బొబ్బిలి వస్తున్నారని జనసేన ఫ్లెక్సీలను తియ్యడం ఏంటని, ఇలాంటి విష సంస్కృతికి తెర లేపవద్దని టిపిఒను ప్రశ్నించారు. ఈ సమస్యపై మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.

అవినీతి నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గురువారం ఎపిజివిబి ఆధ్వర్యంలో వీక్లీ ఎవర్‌నెస్ కార్యక్రమంలో భాగంగా 'అవినీతి నిర్మూలన' అనే అంశం పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మ్యాజిక్ షో ప్రదర్శించారు. కళాశాల ప్రిన్సిపల్ అప్పారావు అవినీతి నిర్మూలన గుర్చి విపులంగా వివరించారు. బ్యాంకు మేనేజర్ కిషోర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సమాజంలో తెలివిన సూచనలు పాటించి భవిష్యత్తులో ఉత్తమ స్థాయికి ఎదగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల గణిత ఉపాధ్యాయులు సాంబశివరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

దెంకాడ: మండల కేంద్రంలో ఎపిజివిబి మేనేజర్ పి. కొండబాబు ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక అక్షరాస్యత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంకు మిత్ర ఎస్ఎల్‌సి కే సూర్య చంద్రరావు, గ్రామ రైతులు, డ్వాక్రా సంఘం మహిళలకు బ్యాంకు స్కీమ్స్ వివరాలను వెల్లడించారు. అనంతరం మెజీషియన్ మ్యాజిక్ షో, జానపద గీతాలు, కళాజాత నిర్వహించారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

భోగాపురం: సమాజంలో జరిగే నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సూర్య కళ అన్నారు. భోగాపురం ఉన్నత పాఠశాలలో గురువారం ఆమె విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ చాలా కీలకమైనదన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువుపైన దృష్టి సారించాలన్నారు. మత్తు పదార్థాలకు కూడా దూరంగా ఉండాలన్నారు. ముఖ్యంగా బాలికలు చాలా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. మీ పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే ఇంట్లో తల్లిదండ్రులకు తప్పనిసరిగా తెలియజేయాలని సూచించారు. చదువుల్లో చక్కగా రాణించాలన్నారు.

టిడిపి వినూత్న నిరసనలు

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని బుచ్చిరాజుపేటలో గురువారం టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి సంధ్యారాణి ఆధ్వర్యంలో జరిగిన టిడిపి దీక్షలో ఒంటికాల్‌పై నిరసన తెలిపారు. టిడిపి మండల అధ్యక్షుడు చలుమూరి వెంకటరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గెడ్డ అన్నవరం, రెడ్డి రాజగోపాల్, సిరిపురం గురునాయుడు, గుమ్మడి సింహాచలం, కొరిపల్లి చిన్నం నాయుడు, గెద్ద కాశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అరగుండుతో నిరసన

శృంగవరపుకోట: పట్టణంలోని ఆకుల డిపో వద్ద గురువారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన రిలే నిరాహార దీక్షలో బీసీ సాధికారిత యాత విభాగం డైరెక్టర్ సిమ్మ అప్పారావు, సీనియర్ కార్యకర్త కిషోర్‌లు పాల్గొని అరగుండుతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి విశాఖ పార్లమెంటరీ, నియోజకవర్గ పరిధిలో ఉన్న టిడిపి నాయకులు, ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: మండలంలోని బర్రిపేట తీరంలో టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకరావు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు గురువారం సముద్రంలో దిగి వినూత్న నిరసన తెలిపారు. అనంతరం సముద్ర తీరంలో ఐ యామ్ విత్ సిబిఎన్ అనే పేరుతో ఇసుకతో చెక్కిన సైకత శిల్పం వద్ద మోకాళ్లపై కూర్చొని నిరసనలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇంచార్జి కర్రోతు బంగార్రాజు, సీనియర్ నాయకులు మహంతి చిన్నంనాయుడు, కంది చంద్రశేఖర్, కర్రోతు సత్యనారాయణ, సువ్వాడ రవిశేఖర్, పతివాడ అప్పలనారాయణ, పల్లె భాస్కరరావు, గేదెల రాజారావు, ఆకిరి ప్రసాదరావు, దంతులూరి సూర్యనారాయణ మూర్తిరాజు, పిన్నింటి శ్రీనువాసరావు, ఇజ్జురౌతు ఈశ్వర్రావు, బొంతు రవి, మైలపల్లి సింహచలం, లంకలపల్లి శ్రీనువాసరావు, ఇనుగంటి రాకేష్‌శర్మ, ఇనపకుర్తి శ్రీనువాసరావు, లంకలపల్లి డాక్టర్, మద్దిల మురళీ, బర్రి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.


ఎస్‌కోట: గుండు గీయించుకుని నిరసన తెలుపుతున్న నాయకులు

సచివాలయం, వెల్నెస్ కేంద్రాల ప్రారంభం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని పాటూరులో నూతనంగా నిర్మించిన సచివాలయం, వెల్నెస్ కేంద్రాలను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీజీ కలల కన్నా గ్రామ స్వరాజ్యాన్ని సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో సుసాధ్యం చేశామన్నారు. ప్రతి కుటుంబానికి గ్రామంలో వైద్య సేవలందించే విధంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని వారిద్దరూ సందర్శించారు. ఈ సందర్భంగా ఓపి, క్షేత్రస్థాయిలో నిర్వహించిన టెస్టు, వైద్య నిపుణులు, మందుల సరఫరా తదితర అంశాలపై ఆరోగ్య సిబ్బందిని ఆరా తీశారు. ప్రజలకు గ్రామాల్లోనే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నిర్వహిస్తున్న ఈ ఆరోగ్య శిబిరాలను ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయ్ కుమార్, కొత్తవలస మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్ మూకల కస్తూరి, ఎంపిపి డి.సత్యవంతుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, పంచాయతీరాజ్ జోనల్ ఇంఛార్జి మెరుపుల సత్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షుడు మమ్ములూరు జగన్నాథం, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, సర్పంచ్ కె. వెంకటలక్ష్మి, ఎంపిటిసి ద్వారపూడి మంగమ్మ, పాటూరు సచివాలయ కన్వీనర్ ద్వారపూడి గంగు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.


నూతన భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

వేపాడలో ఆరోగ్య సురక్ష పరిశీలన

మండల కేంద్రంలో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష ఆరోగ్య సేవలను స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఎంపిపి డి సత్యవంతుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రోగులతో మాట్లాడుతూ వైద్య సేవలు వినియోగించుకోవాలని కోరారు.

విశ్వ సముద్ర సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

దేశంలో పోర్టులు, ప్రాజెక్టుల నిర్మాణంలో పేరుగాంచిన 'విశ్వ సముద్ర' సంస్థ సిబ్బందికి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ యువత పోటీతత్వం ఎదుర్కొనేలా నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. ఇప్పటి వరకు సెంచూరియన్ ద్వారా 5 లక్షల మంది డ్రాపౌట్లకు నైపుణ్యంలో శిక్షణనిచ్చి ఉపాధి కల్పించామన్నారు. విశ్వ సముద్ర సంస్థ ప్రధాన సలహాదారు టి. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పైలట్ ప్రాజెక్ట్ కింద ఇక్కడ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎ. కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ యువతకు ప్రభుత్వం అవసరమైన చేయూత నిస్తుందని క్రమ శిక్షణతో కోర్సు పూర్తి చేసుకోవాలని కోరారు. ప్రాజెక్ట్ హెడ్ పుల్లారావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో స్కిల్స్ డీన్ ప్రొఫెసర్ మురళి, డీన్ డాక్టర్ సన్నీ డియోల్, డాక్టర్ సతీష్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గోవిందరావు, డిపిఎం రవి పాల్గొన్నారు.

ఎ-నెగిటివ్ గ్రూప్ రక్తదానం

ప్రజాశక్తి-విజయనగరం

బొబ్బిలి కి చెందిన మొహమ్మద్ రజియా రక్తహీనతతో బాధపడడంతో ఆమెకు అత్యవసరంగా రక్తాన్ని ఎక్కించాలని వైద్యులు తెలిఇపారు. అరుదైన రక్త గ్రూపు ఎ- నెగిటివ్ కావడంతో ఆమె కుటుంబ సభ్యులు అనేక సామాజిక మాధ్యమాల ద్వారా ప్రయత్నించారు. విజయనగరం యూత్ ఫౌండేషన్ బ్లడ్ గ్రూపులో వచ్చిన పోస్ట్‌ను గుర్తించి యూత్ ఫౌండేషన్ అధ్యక్షులు షేక్ ఇల్తమాష్ వారికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకొని ఆమెకు కావలసిన ఎ- నెగిటివ్ రక్తాన్ని స్థానిక కోట వద్ద గల విజయ బ్లడ్ బ్యాంకులో సేకరించి, ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. దీంతో ఆ కుటుంబ సభ్యులు హర్షం వక్తం చేసి యూత్ ఫౌండేషన్‌కు ధన్యవాదాలు చెప్పారు. కార్యక్రమంలో యూత్ ఫౌండేషన్ సభ్యులు, అశోక్, సాయి, రాయల్ క్యాబ్స్ శరత్, రాము, రఘు, కళ్యాణ్, విజయ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ శివ పుణ్యమంతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- కొత్తవలస

కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులంతా కృషి చేయాలని సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి అన్నారు. సర్పంచ్ అధ్యక్షతన గురువారం కొత్తవలస-4 సచివాలయం వద్ద గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అధికారి పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యల పట్ల దృష్టి సారించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో అంటూ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్త తీసుకోవాలని తెలిపారు. తమకు కేటాయించిన వీధిలో వైద్య సిబ్బంది తరచూ వెళ్లి ప్రజల యోగక్షేమాలు తెలుసుకోవాలన్నారు. పంచాయతీ పరిధిలో ఇళ్ల నిర్మాణాలు సక్రమంగా జరుగుతున్నాయని, వాటిని పర్యవేక్షించవలసిన బాధ్యత సచివాలయ సిబ్బంది దేనని అన్నారు. ఎపిఒ జనార్దన్ మాట్లాడుతూ ఉపాధి హామీ ద్వారా 98 పనులు చేసుకోవచ్చని, దీనికి రైతులు సిద్ధం కావాలని అన్నారు. ఈ సభలో వార్డు మెంబర్లు, పంచాయతీ సిబ్బంది వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సర్పంచ్ రామస్వామి

ఆరోగ్య సురక్ష సద్వినియోగం చేసుకోవాలి

నెల్లిమర్ల: జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. గురువారం చంద్రం పేటలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నేరుగా వైద్య సేవలు అందించడానికి 40రోజుల పాటు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశ పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ళ సుధారాణి, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ళ శ్రీరాములు నాయుడు, డిసిసిబి వైస్ ఛైర్మన్ చనమల్ల వెంకట రమణ, జడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, వైస్ ఎంపిపి పతివాడ సత్యనారాయణ, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, సర్పంచ్ కర్రోతు అప్పల కొండ, ఎంపిటిసి వాళ్ళే గాయత్రి, తుమ్మల పేట పిఎసిఎస్ అధ్యక్షులు కోట్ల పైడినాయుడు, నాయకులు కర్రోతు వెంకట రమణ, వాళ్ళే అప్పలనాయుడు, ఎంపిడిఒ జి.రామారావు పాల్గొన్నారు.

కొత్తవలస: మండలంలోని నిమ్మలపాలెం గ్రామ సచివాలయం పరిధిలో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పాల్గొని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు చేరువ కావడానికి ఇప్పటికే అనేక పథకాలను అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించడం గొప్ప విషయమన్నారు. 45 రోజులపాటు ఈ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని తెలిపారు. అందరికీ ఉచిత ఆరోగ్య పరీక్షలు, ఇంటింటికి వెళ్లి వైద్య సిబ్బంది ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శ్రీనివాసరావు, తహశీల్దారు పాత్రో, వైద్యాధికారులు, ఐసిడిఎస్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: మండలంలోని చేపల కంచేరు సచివాలయ పరిధిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం పరిధిలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు వచ్చి వైద్య పరీక్షలు చేసుకున్నారు. పోలిపల్లి పిహెచ్ వైద్యాధికారి తిరుపతి స్వామి ఆధ్వర్యంలో వైద్యులు వారికి అవసరమైన మందులను అందజేశారు. కొంతమందిని ప్రభుత్వ వైద్యశాలకు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్య నారాయణ రెడ్డి, తహశీల్దార్ చింతాడ బంగా రాజు, ఉప తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ అప్పలనాయుడు, గ్రామ సర్పంచ్ నర్సింహ, నాయకులు ఎల్లారావు, రాము, పాల్గొన్నారు.

నేడు రామచంద్రపేటకు కలెక్టర్

మండలంలోని రామచంద్ర పేట పంచాయతీలో శుక్రవారం నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి హాజరు కానున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను రామచంద్ర పేటలో అధికారులు గురువారం పర్యవేక్షించారు.

ఉపాధి కోసం వచ్చి..

మద్దువలస కాలువలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- రేగిడి

కుటుంబ పోషణలో ఉపాధి కోసం వచ్చి మద్దువలస కుడి ప్రధాన కాలువలో స్నానం చేయడానికి దిగి ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృత్యువాత పడిన ఘటన పలువురిని కంట తడి పెట్టించింది. కాలువ వద్ద చెప్పులు, బట్టలు ఆనవాళ్ళతో పొందూరు మండలం లోలుగు గ్రామానికి చెందిన నవిరి సుదర్శన్‌గా గుర్తించారు. పోలీసులు, రెవెన్యూ అధికారి సమాచారం మేరకు రేగిడి మండలం పోరాం గ్రామ సమీపం మద్దువలస కాలువలో పడి పొందూరు మండలం లోలుగు గ్రామానికి చెందిన నవిరి సుదర్శన్ (28) గురువారం మృతి చెందారు. పోరాం గ్రామానికి చెందిన బూరాడ విష్ణుమూర్తి వద్ద కారు డ్రైవరుగా పనిచేస్తున్న నవిరి సుదర్శన్ ఆ గ్రామ సమీపంలో గల మద్దువలస కాలువకు స్నానానికి వెళ్ళగా ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో మునిగిపోయారు. అక్కడకు వ్యవసాయ కూలీలు స్నానానికి వచ్చి చెప్పులు, బట్టలు చూసి స్నానానికి దిగిన వ్యక్తి కనిపించక పోవడంతో పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందిం చారు. ఫైర్ సిబ్బంది లైఫ్ జాకెట్లు వేసుకొని కాలువలో వెతకగా సుమారు 30 మీటర్లు దూరంలో సుదర్శన్ శవమై తేలేడు. విఆర్ఒ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది, కుటుంబ సభ్యుల సమక్షంలో పంచినామా నిర్వహించారు. పోస్టుమార్టం కోసం రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి తల్లిదండ్రులు, భార్య అరుణ ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

మహిళలకు తీవ్ర గాయాలు

మండలంలోని ఒప్పంగి సమీపంలో అదే గ్రామానికి చెందిన ఉత్తరావల్లి పార్వతి మోటార్ సైకిల్ పై గురువారం రాజాం వెళ్తుండగా మార్గమధ్యంలో మోటార్ సైకిల్‌లకు చీర చుట్టుకుని రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడింది. ఈ ప్రమాదంలో ఆమె కుడి కాలు విరిగిపోయింది. సంఘటన స్థలంలో ఉన్న గ్రామస్తులు 108 కి సమాచారం ఇవ్వగా రేగిడి 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం రాజాం లో ప్రైవేట్ హాస్పిటల్‌కి తరలించారు.

జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలివ్వాలని, ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ గవర్నింగ్ కౌన్సిల్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ జాప్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి గురువారం వినతినిచ్చారు. ఈ సందర్భంగా నాయకులు ఎ.సత్యానారాయణ, రవిచంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన అన్ని జర్నలిస్ట్ కమిటీలలో కార్మిక శాఖ గుర్తించిన యూనియన్లకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. కరోనాలో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన కోలగట్ల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 50/2022.

Between:
Manne Annapoorna and another ...Plaintiffs.
And:
Velicheti Satyanarayana and another .....Defendants.

ప్రకటన

పైనెంబరు దావాలో రెండవ ప్రతివాదికి నోటీసులు నాలుగైదు పర్యాయములు కట్టినను నోటీసులు అందనందువలన వాది కోరిన ప్రకారము పేపరు ప్రకటన ఆర్డరు వేసినారు. సదరు పేపరు ప్రకటన అంశముల ప్రకారము ఓ.యస్. 50/2022 గలది **తే.16-10-2023**దీన మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో వాయిదా కలదు. సదరు వాయిదాకు రెండవ defendant అయిన Medarametla Janaki Lakshmi w/o Jaya Krishna, aged 65 years, Hindu, house wife, residing at Venkateswara Nagar, Ranasthalam Village & Mandal, J.R.Puram Post, Srikakulam District పర్సనల్‌గా గాని, ప్లీడరు గారి ద్వారా గాని **తే. 16-10-2023 దీన ఉదయం గం.10-30 నిముషములకు** విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు కావలసి యున్నది. లేనియెడల మీ పరోక్షములో దావా ప్రొసీడింగ్సు జరుపబడును అని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

సి. హెచ్.వేణుగోపాలరావు
న్యాయవాది, చీపురుపల్లి.

మహారాజశ్రీ విజయనగరం సీనియరు సివిల్ జడ్జివారి కోర్టులో
I.P.14/2023

Between:
Karri Bala ....Petitioner
And:
1. Gorle Narayanamma W/o Padiraju, Yatha street, Dasannapeta, Vizianagaram.
2. Reddi Santhosh W/o Srinu, Althi street, Dasannapeta, Vizianagaram.
3. Korada Gowri W/o Satyanarayana, Althi street, Dasannapeta, Vizianagaram.
4. Gandi Jayaram @ Nadipena Jyothi w/o Srinu, Althi Srinu, Dasannapeta, Vizianagaram.
5. Nadipena Jyothi w/o Srinum yatha street, Dasannapeta, Vizianagaram.
6. S.Saraswathi W/o Venkataramana, Mangala street, Poolbagh, Vizianagaram.
7. Botta Ramadevi w/o Golla Street, Dasanna peta, Vizianagaram.
8. Yatha Mutyalamma w/o Dasannapeta, Vizianagaram.
9. Korada Eswaramma W/o Babji, Althi street, Dasannapeta, Vizianagaram.
10. Kalyani Bushana, Althi street, Dasannapeta, Vizianaga ram.
11. Thirumala Nookaraju s/o Ramu, Rothu Street, Meekala Kannela, Vizianagaram.
12. Arji Bangarraju s/o Sankararao, Shop No. 240 SBT Market, contonment, Vizianagam
13. Rothu Narsingarao S/o late Lakshmana reddy, Routhu street, vizianagaram....Respondents

NOTICE TO PUBLIC

ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా పై నెంబరులో పిటిషనరును దివాలా దారుగా తీర్మానించమని కోరుచూ పై రెస్పాండెంట్సుపై పై నెంబరు పిటిషను దాఖలు చేసినందున ఎవరికైనా ఆక్షేపణలున్న యెడల **తే 14-10-2023దీన ఉదయం 10-30 గంటలకు** పై కోర్టువారి ఎదుట హాజరై మనవి చేసుకొనవలెను. లేనిచో సదరు పిటిషను మీ పరోక్షమందు తీర్మానించబడును.

J.Bheemasena Rao
Advocate for Petitioners
Cell: 9441053628